# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-10-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ – యుఎఈలో పర్యటిస్తారు.**
2. **భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు.**
3. **భారత్ నుంచి ఆస్ట్రేలియాకు పెట్రోలియం, ఔషధాలు, విద్యుత్ యంత్రాలు వంటి కీలకమైన ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రముఖ పాత్ర పోషిస్తోందని ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**
4. **రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్లు మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి వెల్లడించారు.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

=========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ – యుఎఈలో పర్యటిస్తారు. వచ్చే నెల 14, 15వ తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న పార్టనర్ షిప్ సమ్మిట్ కు వివిధ సంస్థల ప్రతినిధులను ముఖ్యమంత్రి ఆహ్వానించనున్నారు. 3 రోజుల పర్యటన కోసం ఈ ఉదయం ఆయన హైదరాబాద్ నుంచి దుబాయ్‌కి బయలుదేరి వెళ్లారు.. పారిశ్రామికవేత్తలతో పాటు యూఏఈకి చెందిన ప్రభుత్వ ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు.

-------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం.. రానున్న 12 గంటల్లో వాయుగుండంగా బలపడనున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా తీరాల వైపు కదులుతూ ఆ తదుపరి 12 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని అన్నారు. దక్షిణ కోస్తా, రాయలసీమలో అతి భారీ వర్షాల నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులతో హోం మంత్రి అనిత సమీక్ష నిర్వహించారు.

సహాయక చర్యలకు ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, పోలిస్, అగ్నిమాపక సిబ్బంది సిద్ధంగా ఉండాలని

ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులపై ప్రజలకు ఎప్పటి కప్పుడు హెచ్చరికలు సందేశాలు పంపాలని చెప్పారు. సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలని మంత్రి సూచించారు.

---------------------------

తిరుపతి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సెలవు ప్రకటించారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలను పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు సహాయం కోసం తిరుపతి కలెక్టరేట్ ఏర్పాటు చేసిన 0877–2236007 నంబరుకు ఫోన్ చేయాలని చెప్పారు.

---------------------------

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఈరోజు గ్రిఫిత్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ మార్నీ వాట్సన్‌తో ఆయన భేటీ అయ్యారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ కళాశాలలో అధునాతన క్రీడా సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... పబ్లిక్ పాలసీ, సస్టైనబిలిటీ, ఇన్నోవేషన్ రంగాల్లో సంయుక్త కార్యక్రమాల కోసం ఆంధ్రప్రదేశ్–గ్రిఫిత్ విశ్వవిద్యాలయం భాగస్వామ్యం ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు. పరిశోధన, విద్యార్థుల మార్పిడి, అవగాహన కార్యక్రమాలను సమన్వయం చేసేలా గ్రిఫిత్ యూనివర్సిటీ ఇండియా సెంటర్ లేదా హబ్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అనంతరం బ్రిస్బేన్‌లోని భారత రాయబార కార్యాలయంలో నిర్వహించిన బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశానికి లోకేష్ హాజరయ్యారు. భారత్ నుంచి ఆస్ట్రేలియాకు కీలకమైన ఎగుమతుల్లో శుద్ధి చేసిన పెట్రోలియం, ఔషధాలు, ఇంజనీరింగ్ వస్తువులు, విద్యుత్ యంత్రాలు, వస్త్రాలు, ఆభరణాలు, వ్యవసాయ ఉత్పత్తులు ఉండగా, ఇందులో ఆంధ్రప్రదేశ్ ప్రముఖ పాత్ర పోషిస్తోందని మంత్రి లోకేష్ చెప్పారు.

---------------------------

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గంలో నిన్న సాయంత్రం మంత్రి పర్యటించారు. కంచర్లవారిపల్లెలో నూతనంగా నిర్మించిన ఎస్సీ హాస్టల్, హై స్కూల్లో సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ , లైబ్రరీ, ఆట స్థలాన్ని మంత్రి ప్రారంభించారు. తర్వాత కనిగిరిలో 25 లక్షల రూపాయలతో ఆధునీకరించిన ఎస్సీ హాస్టల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ..

వాయిస్..28 సెకన్లు

---------------------------

కాకినాడ నగర సమగ్ర అభివృద్ధి, ఆర్థిక సుస్థిరత, పౌర సౌకర్యాల మెరుగుదల లక్ష్యంగా నగరాన్ని, ఆర్థిక వనరులను బలోపేతం చేయడంతో పాటు పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. నిన్న సాయంత్రం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన

పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణానికి అనుకూలమైన అన్ని వనరులు ఉన్న కాకినాడ పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొంటూ..

..వాయిస్.. 20 సెకన్లు

---------------------------

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి లక్షా యాభై వేల కోట్ల రూపాయల సహాయం అందిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. విజయవాడలో ఈరోజు ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. సమగ్ర, సమ్మిళత అభివృద్ధికి పునాదులు వేసేలా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రాధాన్యత ఇస్తోందని, అన్ని ప్రాంతాలలో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా పెట్టుబడులను కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్నట్లు పీవీఎన్ మాధవ్ వివరిస్తూ..

వాయిస్.. 36 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 24వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఆదివాసీల స్వేచ్ఛ కోసం పోరాడిన వ్యక్తి కొమరం భీమ్ జయంతి నేడు. 1901లో అక్టోబర్ 22న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్ జిల్లా ప్రస్తుతం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని సంకెపల్లి గ్రామంలో గోండు తెగకు చెందిన కొమరం చిన్నూ, సొంబాయి దంపతులకి జన్మించిన భీమ్, బాల్యంలోనే సామాజిక అన్యాయాన్ని ఎదుర్కొంటూ పెరిగాడు. అడవిపై ఆధారపడే జీవన విధానాన్ని అర్థం చేసుకుని, దానికి భంగం కలిగించే దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు మొదలుపెట్టాడు. కొమరం భీమ్ ఆదివాసీ ఆత్మగౌరవ ప్రతీక అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఆయన జయంతి సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి నివాళులర్పించారు.

======================